www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 18 జూన్ 2023
1

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



కుభీర్ : మండలంలోని మాలేగాం గ్రామానికి చెందిన పేద విద్యార్థి శల్కే గంగోత్రికి తల్లిదండ్రులెవరూ లేకుండానే 10వ తరగతిలో 9.2 జీపీఏతో ఉత్తీర్ణత సాధించడంతో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, ఎంఈఓ చంద్రకాంత్ కలిసి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఇలాంటి పేద విద్యార్థులు చదువులకు దూరమైన బాధ ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించి వారికి అందరూ తోచిన సాయం చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థినికి మండల అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదిగాలని వారు ఆకాంక్షించారు.

జాతీయ అవార్డు అందుకున్న ఆదిలాబాద్ కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేంద్ర ప్రభుత్వ జల్‌శక్తి శాఖ ప్రకటించిన జాతీయ అవార్డులో ఆదిలాబాద్ జిల్లాకు జాతీయస్థాయిలో మూడో స్థానం లభించింది. నీటి సంరక్షణ, నిర్వహణ విభాగంలో ఉత్తమ జిల్లాగా ఎంపికైంది. జాతీయ నీటి అవార్డుల విభాగంలో ఉత్తమ మూడవ జిల్లాగా ఎంపికైన సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శనివారం అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొని అవార్డును స్వీకరించారు.

సర్కారు బడుల్లో ప్రవేశాల సందడి..!

- ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల మొగ్గు
- ఈ ఏడాది కొత్తగా 4600మంది చేరిక
- ముగిసిన బడిబాట కార్యక్రమం
- ఫలించిన అధికారులు, ఉపాధ్యాయుల కృషి



అధికారుల అంకితభావం..ఉపాధ్యాయుల కృషి ఫలితంగా సర్కారు బడుల్లో ప్రవేశాల సందడి నెలకొంది. అనేక మంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి కనబర్చారు. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంతో ఉపాధ్యాయులు గ్రామాల్లో పిల్లలను గుర్తించడం.. బడుల్లో విద్యాబోధన పట్ల ప్రచారం చేయడం మూలంగా 2023-24 విద్యా సంవత్సరానికి భారీగా నూతన ప్రవేశాలు పెరగడం సానుకూలంశంగా మారింది. 4600మంది విద్యార్థులు ఈ ఏడాది కొత్తగా చేరినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమం ఉండటం.. మన ఊరు- మన బడితో ప్రభుత్వం సదుపాయాలు కల్పించడం.. నాణ్యమైన ఉపాధ్యాయులు ఉండటం కారణంగా తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించేందుకు మొగ్గుచూపినట్లు తెలిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేందుకు వివిధ కారణాలు దోహదం చేశాయని అధికారవర్గాలు చెబుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఒకప్పుడు అందరికీ విద్యనేర్పించి.. ఉన్నతంగా తీర్చిదిద్దిన సర్కారు బడులు ఈ మధ్య కాలంలో వాటి ప్రాభవాన్ని కోల్పోయాయి. దీంతో ఈ బడుల్లో చేర్పించేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మొగ్గుచూపేవారు కాదు. కూలీనాలి చేసుకొని జీవించే వారు కూడా తమ పిల్లలను ప్రయివేటులో చేర్పించాలనే భావనతో ఉండేవారు. కానీ క్రమక్రమంగా సర్కారు బడుల పరిస్థితి మారుతోంది. అధికారుల అంకితభావం.. ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య లభిస్తుందనే నమ్మకం ఏర్పడింది. ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవడంలో భాగంగా ఉపాధ్యాయులు బోధనలో ఉత్తమ మెళకువలు పాటించడం.. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు పాఠశాలల్లోనూ మౌళిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నారు. ప్రభుత్వం సైతం వీటిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. తాజాగా మనఊరు - మనబడి..మన బస్తీ పేరిట ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి 12 అంశాల్లో సదుపాయాలు కల్పిస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 30శాతం పాఠశాలల్లో వివిధ రకాల సౌకర్యాలు కల్పించి ఆధునాతనంగా మార్చారు. ఇప్పటికే అనేకం పూర్తికాగా.. మిగిలిన వాటి నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. పనులు పూర్తయిన పాఠశాలలు ప్రయివేటు కంటే ధీటుగా ఉండటంతో అనేక మంది తల్లిదండ్రులు సర్కారు బడుల్లోనే వారి పిల్లలను చదివించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

కొత్తగా 4600మంది చేరిక

ఈ విద్యా సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లాలో నూతనంగా 4600మంది విద్యార్థులు కొత్తగా చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందుకు వివిధ కారణాలు దోహదం చేశాయి. ప్రభుత్వం బడులు ప్రారంభమైన బడిబాట ప్రారంభించడం కాకుండా ఈ నెల 3వ తేదీ నుంచే మొదలుపెట్టింది. 3వ తేదీ నుంచి 9వతేదీ వరకు, 12వ తేదీ నుంచి 17వరకు చేపట్టాలని సూచించింది. దీంతో ఉపాధ్యాయులు ఉదయమే ఆయా గ్రామాలకు వెళ్లి కొత్త విద్యార్థులను అన్వేషించారు. బడిబాటలో భాగంగా ఇంటింటికి వెళ్లి సర్కారు బడుల్లో సదుపాయాలు, బోధన తీరుపై ప్రచారం చేశారు. తల్లిదండ్రులకు వారి పిల్లల భవిష్యత్తుపై భరోసానిచ్చారు. నూతన ప్రవేశాలతో పాటు ప్రయివేటు పాఠశాలలకు వెళ్తున్న పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు భరోసానివ్వడంతో వారిపిల్లలను కూడా సర్కారు బడుల్లోనే ప్రవేశాలు తీసుకున్నారు. ఒకటో తరగతిలో 2703మంది విద్యార్థులు చేరగా వివిధ తరగతుల్లో మిగితా విద్యార్థులు చేరారు. సర్కారు బడుల్లోనూ ఆంగ్ల మాధ్యమం ఉండటం, ప్రయివేటులో ఫీజుల భారం..తాజాగా చేపడుతున్న మన ఊరు- మనబడి కార్యక్రమంతోనూ అనేక మంది తల్లిదండ్రులు సర్కారు బడుల వైపు మొగ్గుచూపినట్లు తెలిసింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులు మరో 7520మంది వరకు ఉన్నట్లు గుర్తించామని అధికారులు చెబుతున్నారు.



ఉపాధ్యాయుల కొరతను అధిగమించాలి : వి.అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అధికారులు, ఉపాధ్యాయుల కృషి ఫలితంగా సర్కారు బడుల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను అధిగమించాలి. తాత్కాలికంగా నియామకాలు చేపట్టాలి. మన ఊరు- మనబడి కింద తొలి విడతలో చేపడుతున్న పనులను త్వరగా పూర్తిచేసి రెండో విడతలో బడులను అభివృద్ధి చేయడం కోసం ఎంపిక చేయాలి. సర్కారు బడుల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించాలి.



బడిబాటతో ప్రవేశాలు పెరిగాయి : టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్

ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఈ నెలలో చేపట్టిన బడిబాట కార్యక్రమంతో ప్రవేశాలు పెరిగాయి. ఇందుకు అధికారులు, ఉపాధ్యాయుల కృషి చాలా ఉంది. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభించడంతో పాటు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

కృషి..పట్టుదల..ఫలితం..!

- సకల సదుపాయాలు..నాణ్యమైన బోధన
- పదిలో ఏటా శతశాతం ఉత్తీర్ణత
- ఆదర్శంగా నిలుస్తున్న కప్పర్ల ఉన్నత పాఠశాల
- తాజాగా 107మంది నూతన విద్యార్థులు చేరిక

ఉపాధ్యాయుల కృషి..విద్యార్థుల పట్టుదల, గ్రామస్తుల సహకారం కారణంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది ఆ పాఠశాల. ప్రయివేటు కంటే ధీటుగా సకల సదుపాయాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల నాణ్యమైన బోధన, గ్రామస్తుల తోడ్పాటుతో చదువులో రాణిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు తాంసి మండలం కప్పర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని సర్కారు బడుల్లో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే 10జీపీఏ సాధించగా.. ఇందులో ఒక విద్యార్థి కప్పర్ల పాఠశాలకు చెందిన వారు కావడం విశేషం. తాజాగా బడిబాటతో ఏకంగా 107మంది విద్యార్థులు నూతనంగా ప్రవేశాలు తీసుకోవడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది. కప్పర్ల ఉన్నత పాఠశాల ప్రత్యేకతపై నవతెలంగాణ కథనం..



నవతెలంగాణ- తాంసి

తాంసి మండలం కప్పర్ల ఉన్నత పాఠశాల చదువులో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తోంది. కార్పొరేట్ పాఠశాల కంటే ధీటుగా సౌకర్యాలు ఉండటం, డిజిటల్ విద్యను అందించడంతో ఆ ఊరి విద్యార్థులతో పాటు సమీప గ్రామాల విద్యార్థులు ఇందులో చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మన ఊరు- మనబడి కింద ఎంపిక కావడంతో ఇటీవల పీఎంశ్రీ పథకం కింద ఈ పాఠశాల ఎంపికైంది. తాజాగా ఈ విద్యా సంవత్సరం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో నూతనంగా 107మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. ఉపాధ్యాయులు బృందాలుగా వెళ్లి పాఠశాలలో సౌకర్యాలు, బోధనతీరు తదితర వాటిని వివరించారు. దీంతో కప్పర్ల విద్యార్థులతో పాటు సమీప గ్రామాలైన నిపాని, అంతర్గాం, బండల్‌నాగాపూర్, జామిని, భవానిగూడ, వడూర్, పిప్పల్‌కోటితో వివిధ గ్రామాల విద్యార్థులు ఇక్కడ చదివేందుకు ప్రవేశాలు తీసుకున్నారు. పాఠశాలను అందంగా ముస్తాబు చేయడంతో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి సౌకర్యాలతో పాటు పచ్చదనం పరుచుకునేలా అందంగా తీర్చిదిద్దారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ చదువులో రాణించేలా తయారుచేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఏటా ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఎంపికయ్యారు. మరోపక్క జిల్లా స్థాయిలో ఈ పాఠశాల స్వచ్ఛ విద్యాలయ పురస్కారం దక్కించుకుంది. ప్రతి ఏటా వందకు పైగా ప్రదర్శనలతో ప్రత్యేకంగా సైన్స్‌ఫేర్ నిర్వహిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందిస్తున్నారు. జిల్లా స్థాయి క్రీడల్లోనూ ఈ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ పాఠశాలను అప్పటి జిల్లా అదనపు కలెక్టర్ రిజ్వాన్‌భాషాషేక్, ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈఓ ప్రణీత సందర్శించారు. విద్యార్థుల ప్రతిభను మెచ్చుకొని ఉపాధ్యాయులను అభినందించారు.

శతశాతం ఫలితాలు.. ఒకరికి 10జీపీఏ

ఈ పాఠశాల విద్యార్థులు గత రెండేండ్ల నుంచి శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో 85 మంది విద్యార్థులకు గాను అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 25మంది విద్యార్థులు 9జీపీఏకి పైగా మార్కులు సాధించారు. కరణ్ అనే విద్యార్థి 10జీపీఏ సాధించడం విశేషం. జిల్లాలోని సర్కారు బడుల్లో ఇద్దరికే 10జీపీఏ రాగా.. ఇందులో కరణ్ ఒకరు కావడం గమనార్హం. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం.. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతూ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యేలా బోధించడం వంటి చర్యలు చేపట్టారు. వీటితో పాటు కిందటేడాది ఈ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక కావడం.. మరో విద్యార్థి ఉపన్యాస పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ పాఠశాలలో ఉత్తమ బోధన..అభివృద్ధిని చూసి ఆ గ్రామ ప్రజాప్రతినిధులు వారి పిల్లలను ఇదే పాఠశాలలో చదివిస్తూ అవసరమైన సహకారం అందిస్తున్నారు. ఉపాధ్యాయుల పనితీరుతో పాటు పాఠశాల అభివృద్ధికి ఎప్పటికప్పుడు గ్రామస్తులు సహకారం అందించడంతో ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయని అక్కడి ఉపాధ్యాయులు చెబుతున్నారు.





అందరి సహకారంతోనే అభివృద్ధి : కె.కిష్టన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కప్పర్ల

విద్యాశాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతోనే ఈ పాఠశాల అభివృద్ధి చెందుతోంది. పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాఠ్యాంశాలను నిర్దిష్ట సమయంలో పూర్తిచేయడంతో పాటు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఫలితంగా ఉత్తమ ఫలితాలు సాధించాం. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఇక్కడ నాణ్యమైన బోధన ఉండటంతోనే విద్యార్థులు చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

గిరిజన పంచాయతీలకు ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శనివారం ఆమె మండలంలోని హర్కాపూర్ అందుగూడలో గిరిజన ఉత్సవాల కు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ కుడే కైలాస్‌తో పాటు గ్రామస్తులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. రూ.25 లక్షలతో నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కెసిఆర్ ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో బంజారా, ఆదివాసీ భవనాలతో పాటు జోడేఘాట్‌లో ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేశారన్నారు. గిరిజన గూడేలకు కొత్త పంచాయతీ భవనాలను మంజూరు చేసిన ఘనత కెసిఆర్ సర్కార్‌దే నన్నారు. ఆమె వెంట ఎంపీపీ పి.శోభ, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

దిలావర్‌పూర్ : తండాలకు పంచాయతీల హోదా కల్పించి గిరిజనులకు పాలనాధికారం కల్పించిన ఘనత సీఎం చంద్రశేఖర్‌రావుదే అని జడ్పీటీసీ రామయ్య అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నర్సాపూర్(జి) మండలంలోని నందన్‌తండా, అంజనితండా గ్రామాల్లో గిరిజన దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం తండా పెద్దలను సన్మానించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నార్నూర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఖంపూర్, మహాగావ్, తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో గిరిజన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీలో గ్రామ పెద్దలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు సలాం ఆనంద్‌రావ్, రాథోడ్ యశ్వంత్‌రావ్, రాథోడ్ మధుకర్, నోడల్ అధికారి జాదవ్ శివాజీ, రాథోడ్ హరిచంద్, కార్యదర్శులు కాశీరాం, ఆత్రం శంకర్, కోల శేఖర్ గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పకడ్బందీగా ప్రణాళికలను అమలు చేసి గిరిజనుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని జెడ్పిటిసి శారద శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మున్యాల, ఎర్రగుంట, రేవోజిపేట్ తదితర గ్రామాల్లో గిరిజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయం పాలననే ధ్యేయంగా తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు ఇస్తున్నారన్నారు. ఎర్రగుంట గ్రామంలో పెద్దలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిలొసింగ్, సురేష్ నాయక్, డిటి సత్యం, హాజీనాయక్, రవి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.



లక్ష్మణచాంద : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని వడ్యాల్‌తండాలో గిరిజనోత్సవం నిర్వహించారు. గిరిజన సంక్షేమ పథకాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత గిరిజన సంక్షేమనికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ కార్యక్రమలు అమలవుతున్నాయన్నారు. రూ.20లక్షల వ్యయంతో పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో నిధులు మంజూరయ్యాయని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఐటి డిఏ ప్రత్యేక అధికారులు, ఎంపీవో నసీరుద్దిన్, ఐకేపీ ఏపిఓ వాణిశ్రీ, పంచాయతీ సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన తండాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



నవతెలంగాణ-కుభీర్

గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బ్రహమేశ్వర్ తండా బెల్గాం తండా-1 పల్సి తండాలో నూతనంగా రూ.20లక్షల చొప్పున 3 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కావడంతో వాటి పనులకు స్థానిక సర్పంచులు, మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 9సంవత్సరాలుగా గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు వారికి త్వరలోనే అటవీ హక్కు పత్రాలు అందజేసి రైతుబంధు, పంట రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. దీంతో మిగిలిన వారికి కూడా త్వరలోనే అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేసేలా కృషి చేస్తామన్నారు. రేషన్ కార్డులు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో త్వరలోనే కార్డు లేని వారికి కార్డులు పంపిణీ చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, కో ఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దత్తుగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు సుమన్‌బాయి, రోహిదాస్, శాంతబాయి, అనిల్, పండు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు దిగంబర్ పటేల్, నగలింగం జాదవ్, శంకర్, ఎంపీడీఓ లింబాద్రి, ఎంఈఓ చంద్రకాంత్, ఏపిఓ హరిలాల్ పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం

జీవితంపై విరక్తి చెంది యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన జాడి కిరణ్(27) గతంలో విద్యుత్ షాక్‌తో పలు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యాయి. మనస్థాపానికి గురైన కిరణ్ ఖానాపూర్‌లో బంధువుల ఇంటికి వెళ్తుండగా కడెం మండల కేంద్రంలో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకెళ్లాడు. వెంటనే ఆయనను నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమైక్యలో అవకతవకలపై ఆర్‌పీ అరెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అందిన ఫిర్యాదు మేరకు ఒక రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)ను పోలీసులు శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పర్చారు. గత ఏడాది సెప్టెంబర్‌లో స్థానిక ఇందిరా మార్కెట్‌కు చెందిన వాసవి సమైఖ్య ఆర్‌పీ కె. అనిత మహిళా సంఘాల డబ్బులను సొంతానికి వాడుకున్నట్లు పలు మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు. దీనిపై మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ (డీఎంసీ) మోతీరాం విచారణ జరుపగా ఆర్‌పీ అవకతవకలకు పాల్పడ్డట్లు రుజువైంది. దీంతో డీఎంసీ మోతీరాం రూ.33 లక్షలను ఆర్‌పీ అనిత సొంతానికి వాడుకుందని ఈ ఏడాది ఫిబ్రవరి 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ అనంతరం శనివారం అనితను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చామని, కోర్టు అనితకు ఈ నెల 28 వరకు రిమాండ్ విధించినట్లు సీఐ బుద్దె స్వామి తెలిపారు.

భర్త ఆత్మహత్య కేసులో భార్య అరెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన చింతోజు రాజేష్ ఆత్మహత్యకు కారకురాలైన అతని భార్య శ్రీలత అలియాస్ సంధ్యను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్టు సీఐ స్వామి తెలిపారు. మృతుని భార్య శ్రీలతకు కాగజ్‌నగర్‌కు చెందిన బాసిక సతీష్‌తో వివాహేతర సంబంధం ఉండటంతో మనస్థాపానికి గురైన భర్త రాజేష్ ఈ నెల 11న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి రాజేష్ మృతికి కారణమైన శ్రీలతను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్టు సీఐ తెలిపారు. బాసిక సతీష్ పరారీలో ఉన్నాడని సీఐ వివరించారు.

పాల శీతలీకరణ కేంద్రాన్ని ఇక్కడే ఉంచాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో గల విజయ డెయిరీని గుట్టు చప్పుడు కాకుండా అధికారులు వేరే ప్రాంతానికి తరలించే యత్నాలు మానుకోవాలని బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు జక్కుల వెంకటేష్ అన్నారు. రైతులకు పాడి పరిశ్రమ పట్ల అవగాహన పెంచి ప్రోత్సహించాలన్నారు. నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కేంద్రీయ విద్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

2023-24 విద్యా సంవత్సరానికి కాంట్రాక్టు ప్రాతిపదికన టిజిటి(గణితం, సామాజిక శాస్త్రం) ప్యానెల్‌ను రూపొందించడానికి, అర్హత కలిగిన అభ్యర్థులు నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆదిలాబాద్ కేంద్రీయ విద్యాలయ ఇంచార్జి ప్రిన్సిపాల్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న ఉదయం 11.30 గంటల నుండి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అర్హత, జీతం, నియామక నిబంధనల వివరాల కోసం వెబ్సైట్ ఆదిలాబాద్.కేవీఎస్.ఎసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

ప్రహారీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఖబరాస్థాన్ ప్రహరి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల బీఆర్ఎస్ నాయకులు మండల ముస్లింలతో కలిసి శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన మంత్రి ప్రహరీ గోడ నిర్మాణం, ఎలక్ట్రికల్ లైటింగ్ త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్షర అనిల్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి ముస్లిం మైనార్టీ నాయకులు ఉన్నారు.



కారు-బైక్ ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి


కారు-బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని శంకర్ గూడ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌గూడ వద్ద ఎదురుగా వస్తున్న కారుకు మోటార్ సైకిల్ ఢీకొనడంతో దర్శు (19) అనే యువకుడి కాలు విరుగగా సతీష్(25), కిషన్(25),లకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండలం దేవాపూర్‌కు చెందిన ముగ్గురు యువకులు ఇంద్రవెల్లి వైపు వస్తుండగా ముందున్న వాహనానికి ఓవర్ టేక్ చేసి అతివేగంగా వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొంది. దీంతో ఒకరి కాలు విరుగగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి వీరిని మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీమ్‌రావు తెలిపారు.

అట్టహాసంగా గిరిజనోత్సవం

- పాల్గొన్న మంత్రి ఐకే రెడ్డి, ఎమ్మెల్యేలు రేఖా నాయక్, బాపురావు
- త్వరలోనే పోడు భూములకు పట్టాల పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానికంగా హెచ్‌కేజీఎన్ గార్డెన్‌లో నిర్వహించిన గిరిజనోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి గిరిజన సంప్రదాయ నృత్యాలతో మంత్రి, ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు. ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్‌లను మంత్రి, ఎమ్మెల్యేలు, పీఓ ప్రారంభించి పరిశీలించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ముందుగా ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ గిరిజన సంక్షేమ శాఖ ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తొమ్మిదేండ్ల పాలనలో గిరిజనుల అస్తిత్వాన్ని గుర్తించి వారి అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 362 గిరిజన తండాలు, గోండు గూడాలను స్వయం పరిపాలన కోసం నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో గిరిజనులే సర్పంచులు, వార్డు మెంబర్లుగా ఎన్నికై పాలించుకుంటున్నారని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీలకు రూ.20లక్షల చొప్పున నిధులతో గ్రామపంచాయతీ భవనాలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. కేస్లాపూర్ నాగోబా జాతర, దర్బార్, కుమురం భీం జయంతి, వర్ధంతిల సభలను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. గిరిజనుల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. త్వరలోనే పోడు భూములకు పట్టాలను ఇవ్వనున్నామని అన్నారు. బీసీ చేతి కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించనున్నామని అన్నారు. అర్హులందరు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాకు 4 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గిరిజనులకు ఆత్మగౌరవం కల్పించే విధంగా ప్రభుత్వం హైదరాబాద్‌లో ఆదివాసీ, బంజారా భవనాలను నిర్మించి ప్రారంభించిదని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గిరిజన తండాలు, గూడాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు రూ.350కోట్లతో పనులు కొనసాగుతున్నాయని అన్నారు. 100 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న గిరిజన కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలవుతోందని గుర్తు చేశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలనే సంకల్పంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 25 గురుకులాలు, 4 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఆశ్రమ పాఠశాలలను ఇంగ్లీష్ మీడియం బోధనను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్ సదుపాయం కల్పించడం జరిగిందని అన్నారు. అలాగే గిరిజన విద్యార్థులు విదేశీ విద్యనభ్యసించేందుకు రూ.20లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు 10 మంది విద్యార్థులకు రూ.1.83 కోట్లు మంజూరు చేశామని అన్నారు. ఆరు శాతానికి పరిమితమైన గిరిజన రిజర్వేషన్‌ను జనాభా ప్రాతిపదికన పది శాతానికి పెంచిన ఫలితంగా ఎంతో మంది గిరిజనులకు విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా గిరిజన తండాల్లోని ప్రతి గుడిసె, ప్రతి ఇంటికి ప్రభుత్వం కుళాయిల బిగించి, సురక్షిత మంచినీటిని అందించడంతో అనారోగ్యాల బారిన పడే పరిస్థితి దూరమయ్యిందని అన్నారు. గ్రామాలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందాయని, గ్రామాల్లో రోడ్లు, మంచినీరు, విద్యుత్, ప్రాథమిక విద్యా ప్రాథమిక ఆరోగ్యం వంటి అన్ని సౌకర్యాలు కల్పించామని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు కార్యక్రమంలో ఎంతగానో అలరించాయి. అనంతరం ఎంఎస్ఎంఈ ద్వారా గిరిజన లబ్ధిదారులకు రూ.1.50 కోట్ల చెక్కును, హాకీ క్రీడా కారులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. అంతకుముందు మండలంలోని ఎక్స్‌రోడ్డులో 500 లీటర్ల పాలసేకరణ సామర్థ్యం గల డెయిరీ యూనిట్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు, పీఓ, అధికారులు ప్రారంభించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేఖా నాయక్, రాథోడ్ బాపురావు, మహిళ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయితో పాటుగా ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, ఏటీడబ్ల్యుఎసీ చైర్మెన్ కనక లక్కేరావు, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్ పాల్గొన్నారు.







ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన మహిళ అరెస్ట్

- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయక యువకులను నమ్మించి ఘరానా మోసానికి పాల్పడిన మహిళను శనివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఉమేందర్, సీఐ సత్యనారాయణ, ఎస్సై హరిబాబుతో కలిసి వివరాలు వెల్లడించారు. దాదాపు పది మంది నుంచి రూ.49లక్షల 40 వేలను వసూలు చేసినట్లు తెలిపారు. ఫేక్ ఐడీలు, ఫేక్ సర్టిఫికెట్లతో యువతను వంచించి బుట్టలో వేసుకుంది. తీరా విషయం తెలిసిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన తోట రజిత హైదరాబాద్‌కు చెందిన శేషగిరితో కలిసి రైల్వే ఉద్యోగాల పేరిట అమాయక యువకులకు గాలం వేసింది. నకిలీ సర్టిఫికెట్లు, ఐడీ కార్డులు క్రియేట్ చేసి వారి నుండి భారీగా డబ్బులు వసూలు చేసింది. హైదరాబాద్‌లో ట్రైనింగ్ సైతం ఇవ్వడంతో చాలామంది నిజమేనని నమ్మారు. లక్షల రూపాయలు ఆమె చేతుల్లో పెట్టారు. తీరా మోసపోయామని ఆలస్యంగా గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్ల కుమారులు సైతం ఉన్నారు. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సదరు మహిళను శుక్రవారం సాయంత్రం మోచిగల్లిలోని ఆమె చెల్లి ఇంట్లో ఉన్నట్లు అందించిన సమాచారం మేరకు అరెస్టు చేశామన్నారు. ఈ కేసుతో ఇప్పటివరకు ఆరుగురికి సంబంధమున్నట్టు గుర్తించిన పోలీసులు వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఏ ఉద్యోగం అయిన నోటిఫికేషన్ ద్వారానే వస్తుందని, ఇలాంటి వారిని నమ్మి మోసపోవద్దని డీఎస్పీ సూచించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అందరినీ బయటకు తీస్తామని, పూర్తి వివరాలు త్వరలోనే మళ్లీ వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఒక్కటే

- కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు ఒక్కటేనని, పాయల శంకర్ జోగు రామన్నకు తొత్తుల వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జోగు రామన్న, పాయల శంకర్‌ల శరీరాలు వేరైనప్పటికీ వారిద్దరి ఆత్మ ఒక్కటేనరి అన్నారు. పగలంతా పైకి తిట్టుకున్నా, రాత్రిల్లో ఒక్కటై అక్రమ వ్యాపారాలపై మాట్లాడుకుంటారని ఆరోపించారు. రాహుల్ గాంధీతో అమెరికాలో పర్యటించే అవకాశం రావడం తన అదృష్టమని, ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని, ఎలాంటి గ్రూపులు లేవని, అందరిదీ సోనియమ్మ, రాహుల్, మల్లికార్జున ఖర్గే వర్గమేనని స్పష్టం చేశారు. మందిరాలు, మసీదులు తప్ప బీజేపీకి అభివృద్ధిపై ధ్యాసలేదని ధ్వజమెత్తారు. మతాల మధ్య విద్వేశాలు రగిలించడం, వైశమ్యాలు సృష్టించడమే బీజేపీ వైఖరని అన్నారు. మతాల మధ్య విభజన రేఖ గీసి పబ్బం గడుపుకోవడమే బీజేపీకి తెలిసిన విద్య అన్నారు. ఆదిలాబాద్‌లో రాజకీయ చిత్రం మారుతోందన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. స్కూళు, ఆస్పత్రులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి తదితర అభివృద్ధే కాంగ్రెస్ ఎజెండా అన్నారు. కార్యక్రమంలో కామ్రె మనోజ్, మెస్రం చిత్రు, పిడుగు స్వామి, అల్లూరి అశోక్‌రెడ్డి, షేక్ షాహిద్, వెంకటి, దరాడె విఠల్, ఐండ్ల దీపక్, చంద్రకాంత్‌రెడ్డి, మానె శంకర్, గెడం అశోక్ పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాను : గోక గణేష్‌రెడ్డి

నవతెలంగాణ-తలమడుగు

దేవాపూర్ గ్రామంలోని బీసీ కాలనీలో నీటి ఎద్దడి ఉందని యాదవ సంఘం సభ్యులు జెడ్పిటిసి గణేష్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో సొంత డబ్బులతో ఆ కాలనీలో మోటార్ ఏర్పాటు చేశారు. దాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ తన వంతు బాధ్యతగా కనీస సౌకర్యాలు తీర్చేందుకు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన వారు ప్రజల కష్టసుఖాలను పంచుకునే వారే నాయకుడు అని తెలిపారు. తన నిధులు తక్కువగా ఉన్నప్పటికీ వచ్చిన నిధులను అత్యవసరాలకే వినియోగిస్తామన్నారు. అనంతరం బీసీ కాలనీవాసులు గణేష్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫాతిమా బేగం అబ్దుల్లా, ఎంపీటీసీ రమేష్, మాజీ జెడ్పిటిసి బొల్లారపు బాబన్న, సుంకిడి ఎంపీటీసీ గౌరమ్మవెంకన్న యాదవ్, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ షేక్ రఫీ, పోశెట్టి, రఘు, శ్రీనివాస్ యాదవ్, వెంకన్న గ్రామ యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తు గడువును పొడిగించాలి

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ప్రభుత్వం బీసీల్లోని చేతివృత్తులకు అందజేసే లక్ష రూపాయల రుణాలకు సంబంధించిన దరఖాస్తు గడువును పొడగించాలని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఏంబడి చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. దరఖాస్తుదారులకు సంబంధిత ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో, ఇబ్బందులు పడుతున్నారని, అభ్యర్థులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగిన అధికారులు మాత్రం స్పందించడం లేదని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని గడువును మరో వారం రోజులు పొడగించాలని కోరారు.

నూతన సమీకృత కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల విభాగం

నవతెలంగాణ-నిర్మల్

ఇక ప్రతీ సోమవారం నూతన సమీకృత కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల విభాగం ఉంటుందని అదనపు కలెక్టర్ పి.రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమనించి ప్రజాఫిర్యాదుల విభాగానికి వచ్చే అర్జీదారులు పాత కలెక్టరేట్‌కు వెళ్లకుండా, కొత్త కలెక్టరేట్ ఎల్లపల్లిలో తమ అర్జీలను అందజేసి, సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

శాస్త్రీయ సమాజ స్థాపనకు పోరాడాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

శాస్త్రీయ సమాజ స్థాపనకై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సభ్యులు పోరాడాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. శనివారం కనక గణపతి, ఆత్రం భగవంత్‌రావు వర్ధంతులను జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో ఘనంగా నిర్వహించారు. అలాగే 2 రోజుల పాటు ఆ పార్టీ సభ్యుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. కనక గణపతి, ఆత్రం భగవంత్ రావు ఈ దేశంలో అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఎంతగానో కృషి చేశారని తెలియజేశారు. ఆదివాసీ గ్రామాల సమస్యల పరిష్కారానికి పాటుపడుతూ ఈ దేశంలో ఎర్ర జెండా ద్వారా నే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని విశ్వసించారని అన్నారు. తుది శ్వాస వరకు ఎర్ర జెండా బాటలోనే ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించారని గుర్తు చేశారు. ఈ రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ వ్యతిరేక విధానాలు ఆవలంబిస్తూ ఆదివాసుల్లో మత ప్రాతిపదికన చీల్చే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. వాటికీ వ్యతిరేకంగా ఉంటూ ఆదివాసులు ఐక్యంగా బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా గణపతి, భగవంత్ రావుల స్ఫూర్తితో ఉద్యమించాలని అన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నిలబడుతూ శాస్త్రీయ సమాజ స్థాపనకై ప్రతి ఒక కార్యకర్త ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, గంగన్న, సురేందర్, మంజుల, నాయకులు జమున, స్వామి, వెంకన్న, ఆత్రం నగేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. శనివారం పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే జోగు రామన్న చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఇది చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే అర్థం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతి పథకం నిరుపేదలకు మేలు చేస్తుందో లేదో కానీ, బీఆర్ఎస్ లీడర్ల ఆర్థిక బలోపేతానికి మాత్రం పనికి వస్తున్నాయని ఆరోపించారు. గతంలో దళిత బస్తీలో కొందరు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని స్వయంగా సీఎం కేసీఆర్ పేర్కొనడం చూస్తే బీఆర్ఎస్ లీడర్లు అవినీతి ఏ మేరకు కొనసాగుతుందో అర్థమవుతుందన్నారు. తాజాగా బీసీల కోసం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం పలు నిబంధనలు పెట్టడం చూస్తే బీసీలను మోసం చేయడానికే ఈ పథకం అమలు చేస్తోందని అన్నారు. ఏ పథకాలైన ఎమ్మెల్యే కనుసనల్లో పనిచేసే కార్యకర్తలకు, నాయకులు చెప్పిన వారికే పథకాల లబ్ధి పొందుతున్నారని అన్నారు. నిజమైన, అర్హులైన పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, కిష్టు, కన్య ప్రభాకర్ రెడ్డి, దండు మధుకర్, తూడం వినోద్, వెంకట్, సంజీవ్, ఇమ్రాన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంగా పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-కడెం

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పని చేసినప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం కడెం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అలెగ్జాండర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంగా పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పట్ల అధికారుల పనితీరుపై ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సతీష్, ఎంపిడివో వెంకటేశ్వర్లు, మండల సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



హైదరాబాద్ వెళ్లిన కౌన్సిలర్లు

- న్యాయ నిపుణుడితో సంప్రదింపులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మెన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లంతా కలిసి హైదరాబాద్ వెళ్లారు. వీరంతా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం అధ్వర్యంలో బయలు దేరినట్లు సమాచారం. అక్కడ ఓ న్యాయ నిపుణుడిని కలిసినట్టు సమాచారం. పురపాలక చట్టం ప్రకారం మూడేండ్లకు అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశమున్న క్రమంలో ఖానాపూర్‌లోని మెజార్టీ కౌన్సిలర్లు శుక్రవారం కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేసిన సంగతి తెలిసిందే. అయితే గతేడాది ప్రభుత్వం పురపాలక చట్టాన్ని నాలుగేండ్లకు సవరణ చేస్తున్నట్లు ప్రకటించి గవర్నర్ ఆమోదం కోసం పంపినా అది ఆమోదం పొందలేదు. దీంతో మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై కౌన్సిలర్లకు అవిశ్వాసం పెట్టే అవకాశం లభించింది. ఖానాపూర్ మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లకుగాను 9 మంది సభ్యులు అవిశ్వాసం వైపు మొగ్గు చూపారు. అవిశ్వాస తీర్మానానికి ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు ముందుగానే న్యాయపరమైన సంప్రదింపులు జరపడానికి హైదరాబాద్ బయలు దేరినట్టు తెలిసింది.

అంబేద్కర్ నూతన సంఘ భవనం ప్రారంభం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న వేళ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవన నిర్మాణాన్ని ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ భవన్‌ను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ముందుగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, అనంతరం రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అదేవిధంగా ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మెన్‌ను దళితసంఘాల నాయకులు శాలువా, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న గిరిజన దినోత్సవం రోజున అంబేద్కర్ భవన్‌ను ప్రారంభించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రూ.2కోట్ల వ్యయంతో భవన నిర్మాణం పూర్తయిందని అన్నారు. భవన ప్రాంగణంలో షెడ్ తదితర నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఆశయాలను, సిద్ధాంతాలను నిజం చేస్తూ సీఎం కేసీఆర్ సారథ్యంలో ముందుకు పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ డీడబ్ల్యూఓ సునీత కుమారి, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మెన్ దుర్గం శేఖర్, పట్టణ అధ్యక్షులు అజయ్, నాయకులు రామ్‌కుమార్, బాల శంకర్ కృష్ణ, రత్నజాడే ప్రజ్ఞ కుమార్, మల్యాల మనోజ్, నక్క రాందాస్, రాజన్న పాల్గొన్నారు.

రిమ్స్ కార్మికుల సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎంఈ సర్క్యులర్ ప్రకారం వేతనాలు వెంటనే అమలు చేయకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. శనివారం ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రిమ్స్ బ్రాంచ్ కార్యదర్శి ఎంఏ ఖాసీం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ కృష్ణ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ హెడ్ సూపర్‌వైజర్ వేణును శనివారం కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ రిమ్స్‌లో పని చేస్తున్న సానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు డీఎంఈ సర్క్యులర్ ప్రకారం మీ ఏజెన్సీ వారు అగ్రిమెంట్ తీసుకున్న ప్రకారం సంబంధించిన జీఓ నెంబర్ 60 ప్రకారం రూ.15వేల 600 ఇవ్వాల్సి ఉండగా కృష్ణ కన్‌స్ట్రక్షన్ యజమాని ప్రతి నెల కార్మికుల అకౌంట్లలో రూ.11వేస్తున్నారని అన్నారు. అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వకుంటే కార్మికులందరిని ఏకం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నల్ల అరుణారెడ్డి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన వార్డు మెంబర్ నల్ల అరుణారెడ్డి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా, అలాగే బోథ్ మహిళ విభాగం మండల కన్వీనర్‌గా సోలంకి అనితలను రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చారులత, జిల్లా అధ్యక్షులు సాజిద్ ఖాన్, బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్‌లు వారికి జిల్లా కేంద్రంలోని నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సొనాల గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గుడాల శేఖర్, సొనాల పట్టణ అధ్యక్షులు చెట్లపెల్లి అనిల్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడిని ఆదుకున్న కరోనా జాతిరత్నాలు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన మోహితే సునీల్ నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. శనివారం బోథ్ కరోనా జాతి రత్నాల బృందం సభ్యులు రూ.6500 ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కరోనా జాతి రత్నాలు బృందం సభ్యులు డా.నవీన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, డా. విశ్వనాథ్, అల్లకొండ పోతన్న, ఖలీద్, నవీన్, సాగర్‌రెడ్డి, రామకృష్ణ, శివ, మనోహర్, లక్ష్మణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమావేశం

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 19న సోమవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమావేశం ప్రారంభమవుతుందని, ఈ సమావేశంలో బేల, జైనథ్, మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరై విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో సమస్యలు తెలియజేయాలని విద్యుత్ శాఖ ఏడీ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని సోమగూడెం(కే) గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. శనివారం సోమగూడెం క్రీడా మైదానం వద్ద రూ.20 లక్షల నిధులతో మంజూరైన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సపాట్ శంకర్, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, ఏఈ వినయ్, నాయకులు అగ్గి సత్తయ్య, చింతల భీమయ్య, అక్కేపల్లి బుగ్గరాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మండలంలోని వంజిరి గ్రామానికి చెందిన కామ్రే మారుతి, రాంటేంకి రవి కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో కామ్రే మారుతికి రూ.32,000, రాంటేంకి రవి కుమార్‌కు రూ.60,000 మంజూరయ్యాయి. ఈ మేరకు మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే నివాసంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వంజిరి సర్పంచ్ ముంజం రమేష్, నాయకులు బొమ్మెల కిషన్, పోశెట్టి, మౌల్కార్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

- అభివృద్ధికి అధికారులు సహకరించాలి



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని అభివృద్ధి పథకాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఎంపీపీ కంబగోని సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోనప్ప చేతులమీదుగా ఆయా గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్నఐనం, శంకరాపురం గ్రామాల్లో మంచినీరు లేకుండా బోర్లు వేయిస్తామన్నారు. అందవెల్లి వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పూర్తిచేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పెంచికల్‌పేట్ మీదుగా అప్రోచ్ రోడ్డు పూర్తిచేస్తామన్నారు. ఖర్జీ చెరువు మత్తడి నిర్మాణానికి రూ.5.92 కోట్లతో ప్రభుత్వానికి నివేదికలు పంపించామని, త్వరలోనే మంజూరుకానున్నట్టు పేర్కొన్నారు. మండలంలో గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరయ్యాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి పనులను కొనసాగించాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శ్రీరామారావు, వైస్ ఎంపీపీ సురేష్, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ ప్రహ్లాద్ పాల్గొన్నారు.

వేలాల మల్లన్న ఆలయ ప్రహారీ గోడ నిర్మాణాకి భూమి కొనుగోలు



నవతెలంగాణ-జైపూర్

ప్రసిద్ధిచెందిన వేలాల మల్లికార్జున స్వామి ఆయల ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేసినట్లు దేవాదాయశాఖ ఈఓ రమేశ్ తెలిపారు. మల్లిఖార్జున స్వామి ఆలయ సరిహద్దు సర్వే నెం. 191లో గల 2 గుంటల భూమిని రూ.5 లక్షల 20 వేలతో శనివారం కొనుగోలు చేసినట్లు తెలిపారు. దేవాలయాన్ని పున:నిర్మించిన తరువాత ప్రహరి నిర్మాణం కోసం సరిహద్దు భూమి పట్టాదారు దుర్గం రాజలింగు నుంచి స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కొనుగోలు చేసినట్లు తెలిపారు. స్థానిక నాయకులు ప్యాగ లక్ష్మన్, బందారి రాజం, గోపనవేన సాయిలు, పంచిక శంకర్, ప్యాగ మల్లేష్, జంగిలి శ్రీనివాస్ పట్టాదారు దుర్గం రాజలింగుతో సంప్రదింపులు జరిపినట్లు ఆయన తెలిపారు.

రెండు రోజులు అర్బన్ పార్క్‌ల్లో ప్రవేశం ఉచితం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆది, సోమవారాలు రెండు రోజులు జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో ఉన్న అర్బన్ పార్కుల్లో సందర్శకులకు ఉచిత ప్రవేశం ఉంటుందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రివాల్ తెలిపారు. జిల్లాలోని సందర్శకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోరారు. హరితోత్సవ కార్యక్రమం అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హరితోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రివాల్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున హరితోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటాలని కోరారు.

వ్యవసాయ బావిలో గుర్తి తెలియని మృతదేహం

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి మున్సిపాలిటి పరిధిలోని శివపార్వతి ఫంక్షన్‌హాల్ వెనుకాల అడిచెర్ల ఓదెలుకి చెందిన వ్యవసాయ బావిలో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఆ వ్యక్తి చనిపోయి దాదాపు వారం నుండి పది రోజులు అయి ఉండొచ్చని అడిచెర్ల ఓదెలు నార్లపూర్ నివాసి యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. వ్యక్తికి వయస్సు దాదాపు 30 నుండి 40 సంవత్సరాలు ఉండి నీలం రంగు జీన్సు ప్యాంటు, వంకాయ రంగు గల షర్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలలో ఎవరైనా వ్యక్తులు తప్పిపోయిన, పైన తెలిపిన ఆధారాలకు తగ్గట్టుగా వ్యక్తి సమాచారం ఉన్నట్లయితే మందమర్రి పోలీస్‌లను సంప్రదించాలని పేర్కొన్నారు.

22న మహిళలకు వైద్య శిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలో నాయుడు నర్సింగ్‌హోం డాక్టర్ కొండపెల్లి నాగిని నాయుడు ఎంబీబీఎస్, డీజీఓ(ముంబాయి) చంద్రాపూర్ సౌజన్యంతో ఈ నెల 22వ తేదీన స్త్రీలకు మాత్రమే వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ దయాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు హెల్త్ క్యాంపు శ్రీ సద్గురు క్లీనిక్ డాక్టర్ దయాకర్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాంకిడి జడ్పీటీసీ అజయ్‌కుమార్, డాక్టర్ ఆసిఫ్ హుస్సేన్, వినోద్ రానున్నట్టు ప్రజలు క్యాంపును సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు.

తలాయి జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించాలి

- బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కేసీఆర్ హామీ ఇచ్చి 15 ఏండ్లైనా ఎందుకు పూర్తి చేయలేదు..?
- ఆదివాసుల అభివృద్ధి, సంక్షేమం పట్టని కేసీఆర్



నవతెలంగాణ-బెజ్జూర్

ప్రాణహిత నదిపై నిర్మించ తలపెట్టిన తలాయి జలవిద్యుత్ కేంద్రాన్ని ప్రభుత్వం ఎందుకు నిర్మించడం లేదని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. "ఓటు మీదే-నోటు మీదే" అనే నినాదంతో పార్టీ సిర్పూర్ ఇన్‌ఛార్జి అర్షద్ హుస్సేన్ చేపట్టిన యాత్ర బెజ్జూర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కొనసాగింది. మండలంలోని తలాయి గ్రామ సమీపంలో నిర్మించ తలపెట్టిన జలవిద్యుత్ కేంద్రం స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తలాయి జలవిద్యుత్ కేంద్రం నిర్మిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి 15 ఏండ్లైన ఇంతవరకు దానికి అతీ గతీ లేదని విమర్శించారు. జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు తలాయి వద్ద పుష్కలమైన జల వనరులు ఉన్నా కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు నిర్మించడంలేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడితే జిల్లా అంతటికి విద్యుత్ సరిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో పాలకులు హామీలు ఇవ్వడం తప్ప ఆచరణకు నోచుకోవడంలేదని విమర్శించారు. జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఈ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జలవిద్యుత్ కేంద్రాన్ని తక్షణమే నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తలాయి జలవిద్యుత్ కేంద్రం దానికి అనుసంధానంగా ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తే ఇక్కడున్న బీడు భూములన్నీ



సస్యశ్యామలమవుతాయని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆదివాసీ, గిరిజన బిడ్డల బ్రతుకులు బాగు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఆదివాసులకు పోడుపట్టాలు ఇవ్వడంలో, రిజర్వేషన్లు పెంచడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. బీఎస్పీ అధికారంలో వస్తే వెంటనే ఆదివాసీ గూడాల్లో ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించే బాధ్యతను కూడా బీఎస్పీ తీసుకుంటుందన్న ఆయన వచ్చే ఎన్నికల్లో అధికారం బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు.

విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న కేసీఆర్

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు ఉద్దేశించిన మన ఊరు-మన బడి పథకానికి నిధులు విడుదల చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శనివారం యాత్రలో భాగంగా శిథిలావస్థకు చేరిన మండలంలోని కృష్ణపెల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన పరిశీలించారు. 150 మంది విద్యార్థులున్న పాఠశాలలో సరిపడ టీచర్లు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, విద్యా ప్రమాణాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో విద్యావాలంటీర్లను రద్దు చేసిన ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. మన ఊరు-మన బడి కింద నిధులు సక్రమంగా విడుదల కాకపోవడతో పాఠశాలల్లో ఎక్కడ చూసిన సమస్యలు వెక్కిరిస్తున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికి నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. యాత్రలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అర్షద్ హుస్సేన్, జిల్లా ఇన్‌చార్జి సిడెం గణపతి, దుర్గం ప్రవీణ్ పాల్గొన్నారు.

సమీకృత వ్యవస్థతో అభివృద్ధి వేగవంతం

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకువచ్చిన సమీకృత కలెక్టరేట్ విధానంతో అభివృద్ధి వేగంగా జరుగుతుందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. త్వరలో జిల్లా కేంద్రంలో నూతన భవనాలు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి డీపీఓ కార్యాలయం, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవనం, సభాస్థలిని సందర్శించి, సమీకృత కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించారు. అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 40 విభాగాలతో ఐడీఓసీ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన నిర్మాణాలతో అన్ని హంగులతో పరిపాలన సౌలభ్యం కోసం సమీకృత వ్యవస్థను తీసుకువచ్చినట్లు వివరించారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఆసిఫాబాద్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని దీనికి నిదర్శనం కండ్ల ముందు కనిపిస్తుందన్నారు. గతంలో జిల్లా కేంద్రంగా ఉన్న ఆసిఫాబాద్ అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం ఏడు సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. గతంలో హామీ ఇచ్చినట్లు పోడు పట్టాల పంపిణీ కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కుమురంబీం జిల్లా పోడు పట్టాల పంపిణీ లబ్ధిదారుల్లో మూడో స్థానంలో ఉందన్నారు. జిల్లాల విభజన తర్వాత ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల వచ్చిందని అలాగే రానున్న రోజుల్లో ఒక్కో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయ భవనం, భీంరావు, కుమరంభీం విగ్రహాల ప్రారంభం, తర్వాత కలెక్టరేట్ ప్రారంభించడం జరుగుతుందని, సమయాన్నిబట్టి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, జడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు, కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండీ అక్బర్ అలీ డిమాండ్ చేశారు. శనివారం ఆర్కే-1ఏ గని మీద ఎస్‌సీడబ్ల్యుయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి అక్బర్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం అసమర్థత వలన అనేక కార్మిక సమస్యలు పెండింగ్‌లోఉన్నాయని మండిపడ్డారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సింగరేణిలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలని వాయిదా వేస్తూ వస్తుందని, బీఆర్ఎస్ అనుబంధ సంఘం అయినటువంటి టీబీజీకేఎస్ ఓడిపోతుందని ఎన్నికల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యం కాల యాపన చేస్తూ వస్తుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పుని గౌరవించి, హైకోర్టు తీర్పు ప్రకారం సింగరేణిలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎన్నికలు నిర్వహించడం చేత కాకపోతే అన్ని జాతీయ కార్మిక సంఘాలకు గుర్తింపు కల్పించి సింగరేణి సంస్థ నిర్వహించే ప్రతి మీటింగ్‌లలో పాల్గొనే అవకాశం కల్పించాలని అన్నారు. ఇటీవల నస్పూర్ సభలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం సింగరేణి సంస్థకి సంబందించిన 700 కోట్ల లాబాల వాటాను సింగరేణి కార్మికులకు వెంటనే చెల్లించాలని యాజమాన్యంని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ సురమళ్ళ వినయ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ గోవిందుల రమేష్, ఫిట్ కమిటీ సభ్యులు గాజుల రాయమల్లు, మెడం బాల్కొటి రెడ్డి, గోత్త గిరి ప్రసాద్, ఏలూరి శ్రీనివాస్, శ్రీహరి, సిలువేరు హరీష్, కొంక మహేష్, తాండ్ర రామ్ శంకర్, కట్ట నందయ్య, రామక్రిష్ణ, మెరుగు శ్రీనివాస్, గంపల వీరాస్వామి పాల్గొన్నారు.

నేతకాని కులాన్ని విస్మరించడం సరికాదు

నవతెలంగాణ-జన్నారం

రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు, దళిత బస్తీ పథకాల్లో నేతకాని కులస్తులను స్థానిక ఎమ్మెల్యేరేఖా నాయక్ విస్మరించడం సరికాదని నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొదటి విడత దళిత బందులో ఉట్నూర్ కడెం మండలాలకు చెందిన, కొంతమంది నేతకాని కులస్తులకు మాత్రమే దళిత బంధు ఇచ్చారు. కానీ మరి మిగతాఏ మండలాల్లో కూడా నేతకాని కులస్తులకు ఆ పథకం వర్తింప చేయలేదన్నారు. అలాగే దళిత బస్తీలో కూడా, ఏ ఒక్క నేతకాని కులస్తునికి కూడా మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. నేతకాని కులస్తులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేఖా నాయక్ నేతకాని కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగా, మాత్రమే వాడుకొని వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందకుండా చేస్తున్నారన్నారు. ఎస్సీ కులాల్లో ఉన్న అన్ని ఉప కులాలకు ఇచ్చే సంక్షేమ పథకాలను, నేతకాని కులస్తులకు కూడా అందించాలని కోరుతున్నామన్నారు. అన్ని సంక్షేమ పథకాలలో నేతకాని కులస్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో ఖానాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అన్ని గ్రామాల్లో నేతకాని కులస్తుల చేత పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు దుల్లె వెంకటేష్, నియోజకవర్గ నాయకులు బొడ్డు శంకర్, సీనియర్ నాయకులు దుర్గం అమృతారావు, మునేసుల రాజన్న పాల్గొన్నారు.



ఎంవీటీసీలో స్వచ్ఛత పక్వాడ



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా ఎంవీటీసీలో శనివారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేకే-5 కూరగాయల మార్కెట్‌లోని ప్రజలకు, ఉద్యోగులకు, జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఎండీ శ్రీధర్ ఆదేశాల మేరకు అన్ని ఏరియాలలో 15 రోజులపాటు స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం వంటి విషయాలపై ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నామని తెలిపారు. మన చుట్టూ పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఆరోగ్యకరమైన ఆలోచనలు, పనితీరు మెరుగుపడుతుందని కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎంఓఏఐ సెక్రటరీ ఫైడిశ్వర్, డీజీఎం సివిల్ శ్రీనివాసులు, టీబీజీకెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ నాయకులు సుదర్శన్, ఏరియా రక్షణ అధికారి రవీందర్, పర్యావరణ అధికారి ప్రభాకర్, ఎంవీటీసీ ఇన్‌ఛార్జి మేనేజర్ అశోక్, ఎస్ఎస్ఓ రవి, డీవై పీఎం మైత్రేయ బందు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించి అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసోందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని తుంగమడుగు గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్ళుగా తుంగమడుగు గ్రామస్తులు రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తుంగమడుగు గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని గుర్తు చేశారు. ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి తుంగమడుగు గ్రామం వరకు ఐటీడీఏ నిధులు రూ.2 కోట్ల 10 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సిద్దిఖీ, ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, సర్పంచ్ బొట్లకుంట మల్లేష్, ఎంపీటీసీ అరికిల్ల కుమార్, మాజీ జడ్పీటీసీ మౌల్కార్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ నికూరె నాగేందర్, ఐటీడీఏ డీఈ నీరంజన్‌రావు, ఏఈ భద్రోద్దిన్ పాల్గొన్నారు.

'ఖానాపూర్ నియోజకవర్గాన్ని టూరిస్ట్ హబ్‌గా తయారు చేస్తా'



నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో టూరిస్ట్ హబ్‌గా తయారుచేస్తానని హైదరాబాద్ రిటైర్డ్ కలెక్టర్ శర్మన్ నాయక్ అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలను, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. తనను ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పేదలకు అండగా నిలుస్తామన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అన్ని గ్రామాల్లో పర్యటించి పేద ప్రజల జీవన స్థితిగతులను పూర్తిగా అవగాతం చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలకు కావలసిన కూడు, గూడు, నీడ, ఉచిత విద్య వైద్యం అందించడానికి కృషి చేస్తా అన్నారు. ఈ నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు కావలసిన రహదారులు మంచినీరు, విద్యుత్, అందించడానికి కృషి చేస్తామన్నారు. ఈ నియోజకవర్గంలో ఉన్న వనరులను వినియోగించి ఇక్కడ ఉన్న యువతకు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే విధంగా, వారికి అవసరమైన పరిశ్రమలు తీసుకువచ్చి, వారిని అభివృద్ధి చేస్తామన్నారు. టైగర్ జోను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలు ఖానాపూర్ ఎమ్మెల్యేగా తమను ఆదరించాలని కోరారు.

జీతాలియ్యకుంటే బతికేదెట్ల..?



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని గంగాపూర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య, మల్టీపర్పస్ కార్మికులకు ఏడు నెలాల నుంచి వేతనాలు రాకపోవడంతో తాము బతికేదెట్ల అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం వేతనాలు వెంటనే ఇవ్వాలని పంచాయతీ కార్యాలయం ఎదుత ధర్నా చేపట్టానరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు జీతాలిస్త లేరు, ఊర్లో కిరాణా దుకాణాల్లో కనీసం ఉప్పు, పప్పు కూడా ఉద్దెర దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. ఇలాంటి పరిస్తితుల్లో తాము బతికేదెట్లని ప్రశ్నించారు. ఈమధ్య పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో పిల్లలకు కనీస పెన్నులు నోట్ పుస్తకాలు కొనాలేని పరిస్థితి ఉందని వాపోయారు. ఇప్పటికైనాపై అధికారులు స్పందించి తమకు వేతనాలు అందేవిదంగా చర్యలు చేపట్టాలని కోరారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

ఆదివారం 18 జూన్ 2023

విలువలతో జీవితంలో ఎదగాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు మార్పు కోసం జీవన బడి కార్యక్రమం నిర్వహించారు. శనివారం కనకాపూర్ గ్రామంలోని డిఎన్ఆర్ గార్డెన్‌లో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రాహ్మన్న మాట్లాడుతూ మానవ సంబంధాలు మానవ జీవితానికి అత్యంత ఆవశ్యకమన్నారు. విలువలతో కూడిన జీవితం గడపాలని, ఆ దిశగా విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. సాటి మనిషిని గౌరవిస్తూ, విలువలు పాటిస్తూ, పర్యావరణం, ప్రకృతిని కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నాగమణి, సూపర్వైజర్ భాగ్యవతి, వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్, ఐకేపి ఏపిఓ వాణిశ్రీ, వరల్డ్ విజన్ సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్రం కమిటీ పిలుపు మేరకు శనివారం తహసీల్దార్ రామ్మోహన్‌కి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా మున్నూరుకాపు ప్రజలు ఉన్నారని వారికి అనుగుణంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలని అన్నారు. కాపు విద్యార్థుల కోసం జిల్లాకేంద్రంలో వసథిగృహం ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు గడ్డల సురేష్, మనిగొండ వెంకటేశం, పొలంపల్లి గణపతి, రుకుం ప్రహ్లాద్, మారిశెట్టి రమేష్, మెకార్తి శ్రీనివాస్, గడ్డల శంకర్, సైదం సురేష్, బాలధారపు మధుకర్, రాజయ్య, శంకర్ పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు : దివాకర్‌రావు



నవతెలంగాణ - హాజీపూర్

ప్రభుత్వ పథకాల కోసం దళారులను ఆశ్రయించొద్దని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో 58మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రజల ప్రభుత్వమని, ప్రజల అవసరాల కోసమే కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలయ్యే పథకాలే దేశానికి ఆదర్శమని తెలిపారు. ఈ మధ్య తనపై కొందరు పని కట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా సేవకునిగా ఉంటానన్నారు. మెడికల్ కాలేజీ తన ద్వారానే జిల్లాకు మంజూరైన విషయం గుర్తుంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, జెడ్పీటీసీ పుస్కురి శిల్ప, జెడ్పీ కో ఆప్షన్ నహీం పాషా, సర్పంచులు ఆనే మల్లేష్, గోళ్ల శ్రీనివాస్, మంచాల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, బేర పోచయ్య, రాజయ్య, డేగ బాపు, కందుల రమేష్, సునీల్‌రావు పాల్గొన్నారు.

ఓరియంట్ సిమెంటు కంపెనీకి 'గ్రేట్ ప్లేస్ టూ వర్క్' అవార్డు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనికి 'గ్రేట్ ప్లేస్ టూ వర్క్' అవార్డు సాధించింది. ఉద్యోగులకు, కార్మికులకు పని ప్రదేశంలో సానుకూలమైన పని వాతావరణాన్ని కల్పించడంలో సంస్థ ప్రాముఖ్యతను గుర్తించి బెస్ట్ కాంపనీస్ టు వర్క్‌లో భారతదేశంలో 70వ స్థానం, బెస్ట్ వర్క్ ప్లేసెస్ ఇన్ సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్‌లో దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. మోస్ట్ ట్రస్టెడ్ లీడర్‌గా సంస్థ ఎండీ, సీఈఓ దీపక్ క్షేత్రపాల్ గుర్తింపు పొందారు. ఈ మేరకు శుక్రవారం ముంబైలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో సంస్థ ఉత్పత్తి ప్రెసిడెంట్ సత్యబ్రత శర్మ, హెచ్ఆర్ హెడ్ శేష శ్రీనివాస్, సేల్స్ హెడ్మనీష్ దువ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా దీపక్ క్షేత్రపాల్ మాట్లాడుతూ కంపెనీలోని ఉద్యోగులే తమ చోదక శక్తి అనే నమ్మకం, పునాది మీద మా సంస్థ నిర్మితమైందని, సంస్థలో ప్రతి వ్యక్తి పూర్తి శక్తి సామర్థ్యాలను సాధించ డానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా దేవాపూర్ యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి సంస్థ ఉద్యోగులకు, కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

జనపనార సంచులు పంపిణీ



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని జీఎం కార్యాలయ ఆవరణలో స్వచ్ఛత పక్వాడ రెండో రోజు కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ఉద్యోగులకు శనివారం జనపనార సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించాలని కోరారు. మార్కెట్‌కు వెళ్లినప్పుడు, నిత్యవసర వస్తువుల కోసం దుకాణానికి వెళ్లినప్పుడు ప్లాస్టిక్ సంచులకు బదులుగా బట్ట లేదా జనపనార సంచులను తీసుకెళ్లాలని అన్నారు. భవిష్యత్ తరాలకు పర్యావరణాన్ని సురక్షితంగా అందించాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని నిరోదించడం ప్రధానమని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బెల్లంపల్లి ఏరియాలోని ప్రతి సింగరేణి ఉద్యోగికి జనపనార సంచులు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహేర, పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణ్‌రావు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, పర్సనల్ అధికారి జీకే కిరణ్‌కుమార్, జూనియర్ ఫారెస్టు ఆఫీసర్ నవీన్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్, జీఎం కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతా 'కోత'లే..!

- కాగజ్‌నగర్‌లో అప్రకటిత విద్యుత్ కోతలు
- అవస్థల్లో వినియోగదారులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్‌రూరల్

తెలంగాణ రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తాం...భవిష్యత్ తరాలకు విద్యుత్ కోతలంటే తెలియని విధంగా సరఫరా చేస్తాం... ప్రభుత్వ పెద్దల మాటలు ఇవి. కానీ ఆచరణలో పూర్తి భిన్నంగా తయారై ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తీరుకు నిదర్శనంగా మారింది. కాగజ్‌నగర్‌లో విద్యుత్ సరఫరా తీరిది. కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో విద్యుత్ కోతలు సర్వసాధారణంగా మారాయి. ఇక్కడ అప్రకటిత విద్యుత్ కోతలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. వేళాపాళ, రాత్రీపగలు తేడా లేకుండా కోత విధిస్తున్నారు. కరెంటు కోతపైన అధికారుల కోసం ఫోన్ చేసే వారికి పూర్తి నిరాశ మిగులుతోంది. విద్యుత్ కోత ఎంతసేపు ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఏ ఒక్కరూ ఫోన్ ఎత్తరు. కరెంట్ ఆఫీస్‌కు ఎవరెళ్లినా అధికారులు ఫీల్డ్‌లో ఉన్నారన్నదే అక్కడ సమాధానం. ఫోన్‌లోను దొరకరు..కార్యాలయాల్లోనూ దొరకరు. కరెంట్ ఎందుకు తీస్తున్నారో తెలవదు. అధికారికంగా మాత్రం కరెంటు కోతలేదని చెబుతున్నారు.

వినియోగదారుల అసహనం

వర్షాకాలం ప్రారంభం కాకుండానే పరిస్థితి ఈ విధంగా ఉంటే భవిష్యత్తులో ఎలా ఉంటుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కోతలు లేవని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో మరమ్మతుల పేరిట అన్ని రంగాలకు ఇస్తున్న కరెంటు సరఫరాలో ఏదో ఒక సాకుతో కోతలు విధిస్తున్నారు. వ్యవసాయ, పరిశ్రమలు, గృహాలు, కమర్షియల్ సర్వీసులకు కోతలు తప్పడం లేదు. సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, స్తంభాల ఏర్పాటు, లూజ్ వైర్ల మరమ్మతులు అంటూ నెలలో ఒకటి రెండు సార్లు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపేవేస్తున్నారు. ఇక మిగతా రోజుల్లో అప్రకటితంగా అనేక కోతలు విధిస్తున్నారు. గట్టిగా గాలి వీచినా, ఇతర ఏవైనా రిపేర్లు వచ్చినా కోతలు అదనంగా ఉంటాయి. గ్రామాలు, పట్టణాల్లో సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి, పల్లెప్రగతి కార్యక్రమాలు నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో ప్రధానంగా విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి సమయం కేటాయించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న పనులు గుర్తించి యుద్ధప్రాతిపదికన జారీ చేశారు. అప్పట్లో చేసిన మరమ్మతులు తాత్కలికంగానే పని చేశాయి. నిత్యం ఏదో ఒక కారణంతో గంటల తరబడి కరెంట్ సరఫరాలో కోత విధించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనా ఎండలు తీవ్రంగానే ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరోవైపు కరెంటుపై ఆధారపడి నడిచే వ్యాపారాలు సైతం దెబ్బతింటున్నాయి. బీసీలకు అందించే రూ.లక్ష ఆర్థిక సాయం కోసం ప్రతి రోజు వందల సంఖ్యలో బీసీలు ఈ సేవా, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గడువు సమీపిస్తుండడం కరెంటు కోతతో కార్యాలయాల్లో ఇబ్బందులు తలెత్తడం ఇబ్బందికరంగా తయారైంది. కరెంటు లేకపోవడంతో ఆయా కార్యాలయాల్లో సేవలకు అంతరాయం కలుగుతోంది. గృహావసరాలకు సరఫరా చేసే విద్యుత్ హైవోల్టేజీ లోవోల్టేజీ రావడంతో గృహోపకరణాలు కాలిపోయే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

- దుర్గం కమలాకర్, టౌన్ ఏఈ ట్రాన్స్‌కో

పట్టణంలో విద్యుత్ కోతలు వాస్తవమే. పలు కాలనీల్లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల వల్ల తరచూ కోతలు విధించాల్సి వస్తోంది. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు నివేదికలు పంపించాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

జైలు జీవితంతో ప్రవర్తనలో పరివర్తన రావాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైలు జీవితంతో ఖైదీల ప్రవర్తనలో పరివర్తన రావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజ్ అన్నారు. సబ్ జైలును శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైలు జీవితం ఖైదీలో పరివర్తన తీసుకురావాలని తెలిపారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. జైలులో నేర్చుకున్న పలు మంచి అంశాలు నిత్య జీవితంలో అనువర్తింప చేసుకోవాలని సూచించారు. నేర ప్రవృత్తి వల్ల సమాజంలో గుర్తింపు కోల్పోయే ప్రమాదముంటుందన్నారు. చట్టాలపై ఖైదీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారి ప్రేమ్‌కుమార్, అడ్వకేట్ నరహరి, రాజీవ్‌రెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మహార్ సంఘం బలోపేతానికి కృషి చేయాలి

- తెలంగాణ మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి దీపక్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మహార్ సంఘం బలోపేతానికి నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ కృషి చేయాలని తెలంగాణ మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి దీపక్ అన్నారు. శనివారం మండలంలోని చింతగూడ, కోయవాగు గ్రామంలో సంఘం సమావేశం నిర్వహించారు. చింతగుడా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. జాడి దీపక్ మాట్లాడుతూ మహార్ కులస్తులకు చాలా సంవత్సరాలుగా కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మాల కుల సర్టిఫికెట్ ఇస్తున్నారన్నారు. దీంతో మహార్ సర్టిఫికెట్‌కు గ్రామ కమిటీల నుండి రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేసి మహార్ సర్టిఫికెట్ జారీ చేయడానికి కమిటీలను విస్తృత పరచడం జరుగుతోందన్నారు. నూతన కమిటీ మహార్ సంఘం లక్ష్యాలను నెరవేర్చే దిశగా పోరాటాలకు సిద్ధమవ్వాలని సూచించారు. చింతగూడ మహార్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడుగా దుప్త రమేష్, ప్రధాన కార్యదర్శిగా పెరుగు రాజ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు కచురూ, వెంకటి, మెంగాజి, అంబెద్కర్ యువజన అధ్యక్షుడు జాడి ప్రశాంత్, కిరణ్, సందీప్, గోవర్ధన్, గణపతి, మారుతి పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి



నవతెలంగాణ-హాజీపూర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై చేపట్టిన జీపు జాతా శనివారం జిల్లా కేంద్రానికి చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఎనగందుల భానుమతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా బడ్జెట్ తగ్గిస్తోందన్నారు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకోజూస్తోందన్నారు. అంగన్వాడీ కేంద్రాలన్నీ గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయని, గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించే దిశగా పని చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుండి వచ్చే అన్ని పథకాలు ప్రజలకు అందుబాటులో ఉంచడానికి అంగన్‌వాడీలు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అంగన్వాడీలపైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నశించాలన్నారు. వెంటనే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు గ్రాట్యూటి ఇవ్వాలన్నారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు ఐదు లక్షలు, ఆయాలకు మూడు లక్షలు, జీవితంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోశాధికారి సునీత మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ధరలు అనుగుణంగా అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలు, ఐసిడిఎస్ వ్యవస్థపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు మార్చుకోకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి సువర్ణ, మహేశ్వరి, చంద్రకళ, అనురాధ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వీటు ముక్కకు కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అర్హులు కారా

- సింగరేణి యాజమాన్యానికి సీఐటీయూ సూటి ప్రశ్న
- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-రెబ్బెన

స్వీటు ముక్కకు కూడా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు అర్హులు కారా అని సింగరేణి యాజమాన్యానికి సీఐటీయూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు సూటి ప్రశ్న వేశారు. శనివారం ఖైరిగూడ ఓపెన్‌కాస్టు వద్ద జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సింగరేణిలో సంబరాలు జరిపిన అధికారులు, పర్మినెంట్ కార్మికులకు స్వీట్లు పంచి కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వకుండా వారిపట్ల తీవ్రమైన వివక్షత చూపించారని అన్నారు. కాంట్రాక్టు కార్మికులు కనీసం ఒక స్వీటు ముక్కకు అర్హులు కాదా అని ఆవేధన వ్యక్తం చేశారు. 2022 సెప్టెంబర్‌లో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు జేఏసీ నాయకత్వంలో చేసిన 18 రోజుల సమ్మె అనంతరం జరిగిన ఒప్పంద విషయాలు, బోనస్, ఈఎస్ఐ అమలు చేయాలని పోరుబాట పట్టిన సీఐటీయూ దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కోలిండియాలో కాంట్రాక్టు కార్మికులకు రూ.1042 చెల్లిస్తుండగా సింగరేణిలో కేవలం రూ.494 చెల్లిస్తున్నారని సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కూడా కోలిండియా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 22ను వెంటనే గెజిట్ చేసి కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణికి వస్తున్న ప్రతి రూపాయి లాభాల్లో పర్మినెంట్ కార్మికులతో సమానంగా బొగ్గు ఉత్పత్తిలో పాల్గొంటున్న కాంట్రాక్టు కార్మికుల చెమట చుక్కలు ఉన్నాయని అన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి వేతనాలు పెంచుకుంటున్నారు తప్పా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు మాత్రం పెంచడంలేదని అన్నారు. అందుకే జూన్ 17 నుండి జూలై 22 వరకు వివిధ రూపాల్లో పోరుబాట పట్టినట్టు మధు తెలిపారు. కార్మికుల నివాస ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వాలని, కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా జీఎం కార్యాలయాల ముందు జూలై 14, 15వ తేదీల్లో దీక్షలు చేపట్టి జూలై 21, 22వ తేదీలో కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద 48 గంటల పాటు దీక్ష చేపట్టాలన్నారు. కార్మికుల జీతాల పెరుగుదలకు అన్ని పోరాటాల్లో పెద్దఎత్తున పాల్గొని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.ఓదెలు, ఏఐటీయూసీ నాయకులు అశోక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం విఫలం

- గోవురుగూడ గ్రామస్తుల ఆవేదన



నవతెలంగాణ-రెబ్బెన

ఖైరిగూడ ఓసీలో భూములు తీసుకొని, సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని గోవురుగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖైరిగూడ ఓసీ వద్ద తాగునీటి కోసం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. వీరికి సీఐటీయూ సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.ఓదెలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మధు గోవురుగూడ గ్రామస్తులకు మద్దతు తెలియజేసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2006లో సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల కోసం తమ భూములను దారదత్తం చేసిన గ్రామస్తులకు ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం మంచినీటి సౌకర్యం కల్పించకపోవడం, వారికి కనీసం హెల్త్ కార్డులు కూడా ఇవ్వకుండా వివక్షత చూపిస్తున్నారని అన్నారు. ఇటు సింగరేణి యాజమాన్యం, అటు రాష్ట్ర ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం వెంటనే గోవురుగూడ గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించి, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. గోవురుగూడ గ్రామస్తుల దాహం తీర్చాలని, వెంటనే వారికి తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఆటాపాటలతో గిరిజనోత్సవం

నవతెలంగాణ-మందమర్రి

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మందమర్రి మండలం పులిమడుగు గ్రామంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గిరిజనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పులిమడుగు గ్రామ ప్రజలు గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వీధుల్లో బీజే చప్పుళ్ల ఆటా పాటలతో నృత్యాలు చేస్తూ వారి ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం గిరిజన పెద్దలను, ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, స్థానిక సర్పంచ్ దేవి, జడ్పీటీసీ వేల్పుల రవి, రూరల్ ఇన్‌ఛార్జి మద్దిశంకర్, వైస్ ఎంపీపీ రాజ్ కుమార్, యూత్ అధ్యక్షుడు రవినాయక్, ఎంపీటీసీ తిరుపతి నాయక్, బొక్కలగుట్ట సర్పంచ్ సువర్ణ పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని పలు గ్రామాల్లో గిరిజన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం మండలం దొంగపల్లి, ఆల్లిపూర్ గ్రామాల్లో గిరిజన ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్రం హనుమంత్ పాల్గొన్నారు. కొత్తపేట గ్రామపంచాయతీలో గిరిజన గిరిజన ఉత్సవాలలో గ్రామ సర్పంచ్ మలావత్ లావణ్య ప్రేమ్ సింగ్, కార్యదర్శి భీంరావు ఉప సర్పంచ్ ఎస్.తిరుపతి పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని మల్కేపల్లి, లంబాడితాండ(డీ) గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గిరిజనోత్సవంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. ముందుగా మల్కేపల్లిలో ర్యాలీలో పాల్గొని కుంరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. లంబాడితాండ(డీ)లో పూజా కార్యక్రమంలో పాల్గొని గిరిజన పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌ను గిరిజనులు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, ప్రత్యేకధికారి పురుషోత్తంనాయక్, ఎంపీఓ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి, సర్పంచ్‌లు అజ్మీర తిరుపతి, కుడిమేత లక్ష్మీ, ఉప సర్పంచ్ జనార్ధన్, డీఆర్పీలు శాంకరి, అశోక్రారావు పాల్గొన్నారు.

జైపూర్ : సాంప్రదాయంగా నిర్వహించాల్సిన పూజ కార్యక్రమాలను భావితరాలకు అందించాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాంగంగా శనివారం వెంకట్రావ్‌పల్లిలో స్థానిక ఎంపీటీసీ లింగస్వామితో కలిసి శనివారం గిరిజన ఉత్సవాలు జరుపుకున్నారు. గ్రామంలో గల లక్ష్మిదేవి ఆలయంలో సాంప్రదాయ పద్ధతుల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రత్యేకంగా లక్ష్మికి ఇష్టమైన పట్నం వేసిన గిరిజనలు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతి ఉప సర్పంచ్ తిరుమల వాసు, స్థానిక గిరిజన కుటుంబాల వారు టీమిని అమ్మాయి(పెద్దమ్మ) టీమిని సంజీవ్, మాల్కరి మల్లేష్‌లతో పాటు గ్రామంలో దేవతామూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సంధర్భంగా గిరిజన పూజారులను శాలువాలతో సన్మానించడతో పాటు గిరిజనోత్సవంలో పాల్గొన్న వారందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, పంచాయతి కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ గిరిజన ఉత్సవాలను మండలంలోని మేడిపెల్లి, భూపాలపట్నం, లోనవెల్లి, కర్జెపెల్లి, డోర్‌పెల్లి గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మేడిపెల్లి గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల్లో గిరిజనులు సంస్కృతి ఉట్టిపడేల ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ వెడ్మ భీంరావు, ఈఓ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

కాసిపేట : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలో ఘనంగా గిరిజనోత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీలో గిరిజన ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని గిరిజనులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులు అంతా కలిసి సాంప్రదాయ గిరిజన వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

కౌటాల : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివాసీ సాంస్కృతిక నృత్యాలతో దశాబ్ది ఉత్సవాలను శనివారం సర్పంచ్ మడావి రేణుక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆదివాసుల సాంప్రదాయ బద్ధమైన ఏకరూప దుస్తులు ధరించి కుమురంభీం ప్రాంగణంలో ఆటపాటలతో అలరించారు.

ముగిసిన సప్లిమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిసాయి. జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్, డీఈసీ బృందం సభ్యులతో కలిసి ఆసిఫాబాద్‌లోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు రోజులుగా నిర్వహించిన ప్రధాన పరీక్షలు ముగిసాయన్నారు. చివరి రోజు జరిగిన పరీక్షల్లో ఉదయం ప్రథమ సంవత్సరం మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుకుగాను పరీక్షలు నిర్వహించాని తెలిపారు. ఉదయం జిల్లా వ్యాప్తంగా జనరల్ 569, ఒకేషనల్ 39 మొత్తం 613 మంది విద్యార్థులకు గాను జనరల్ 540, ఒకేషనల్ 32 మంది హాజరయ్యారని, మొత్తం 36 మంది గైర్హాజరయ్యారని అన్నారు. మధ్యాహ్నం జనరల్ 202, ఒకేషనల్ 18 మొత్తం 220 మంది విద్యార్థులకు గాను జనరల్ 195, ఒకేషనల్ 17 మంది హాజరయ్యారని, మొత్తం 8 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యుడు నైతం శంకర్ పాల్గొన్నారు.